కే ఎస్వీ

ఎన్నిక

పూర్ణాయ్‌తో కాస్త పనుండి వెళ్ళాను, ఆ ఊరు.

(ఆంధ్ర దేశంలో ఒక ఊరు. పేరు- ఏదైతేనేం ?)

చీకటిపడే వేళ బస్సు దిగాను. రిక్షాను పిలవబోతూ, కాస్త సందేహించాను.

సంవత్సరం క్రితం ఇలాగే బస్సు దిగి, పూర్ణాయ్ ఇంటికి రిక్షాలోవెళ్ళి, కిరాయి విషయమై రిక్షావాడితో గొడవ పడాల్సివచ్చిన సంఘటన గుర్తొచ్చింది.

అప్పుడైనా - రిక్షావాడిదీ పూర్తిగా తప్పు కాదు.

బస్టాండు - ఊరికి ఒక చివరుంటే - పూర్ణాయ్ ఇల్లు మరో చివరన ఉంది. ట్రంక్ రోడ్‌మీద దాదాపు మైలు దూరం వెళ్ళాలి. అక్కడ ఎడంవేపు మలుపు తిరిగితే కంకర రోడ్డు వస్తుంది. అది తిన్నగా వెళ్ళదు. ఘోరమైన ఎగుడు దిగుళ్ళతో ఆ రోడ్డమ్మట అరమైలు వెళ్తే 'లేబర్ కాలనీ' వస్తుంది. ట్రంక్ రోడ్‌కీ లేబర్ కాలనీకీ మధ్య వైకుంఠ నగర్ అని ఒక కాలనీ ఉంది. 'అల వైకుంఠ పురంబులో నగరిలో' అన్న ముక్క సార్థకమయ్యేట్టు — అదిగో - ఆ వైకుంఠ నగర్‌లో - మావాళ్ళ ఇల్లు !

ట్రంక్ రోడ్డు ఆ మైలు పొడవూ కాస్త ఎక్కువే! ఇక ఆ కంకరరోడ్డుమీద రిక్షాతొక్కటమంటే వల్లమాలిన ప్రయాసే ! మరీ - పొద్దుపోయాక అయితే- ఇక అక్కణ్ణుంచి' వచ్చేకిరాయిలు' కూడా ఏమీ తగలవు. అందుచేత - రిక్షావాళ్ళతో పేచీ వస్తుందంటే ఆశ్చర్యం లేదు !

పిలవకున్నా ఎదుటికొచ్చి నిలుచున్నాడు ఒక రిక్షావాడు. "ఎక్కండి సార్ !" అన్నాడు, ఎక్కడికైనా సరేనన్నట్టు, బాడుగ ఎంతైనా సరే న్నట్టు.

"వైకుంఠనగర్ !" అన్నాను. ఆ రెండు ముక్కల్లోనూ చాతనైనంత మెత్తటి బెదిరింపును ధ్వనింపజేస్తూ.

"అంటే-లేబర్ కాలనీ దగ్గరా సార్ ?—"

"అవును - అక్కడే —"

"ఎక్కండి —"

"ఏమివ్వను ? —"

"మీకు తెలవన్దేముంది సార్ .... అంతా మిట్ట - రాత్రిపూట - వొచ్చేప్పుడు ఖాళీగా రావాలి.... రెండ్రూపాయలిప్పించండి—"

ఆశ్చర్యపోయాను. క్రితంసారి రిక్షావాడు నాలుగు అడిగినట్టు గుర్తు. మూడు అంటే వాడు మూడున్నర అని - చచ్చినా ం ఇవ్వనంటే వాడు సరేనని ఎక్కించుకుని — తీరా ఇల్లు చేరాక - మూడున్నర ఇవ్వాల్సిందేనని వాడు పట్టుబట్టటం ....

"ఎక్కండ్సార్ వెళ్ళిపోదాం — వైకుంఠనగరేనా- ఇంకా పైకిపోవాలా ?—"

వైకుంఠానికి వెళ్ళినవాడు ఇంకేం పైకిపోతాడు — అని స్వగతంలో జోకేసుకున్నాను, వీడు పొరపాటుగా వినలేదు. రెండు రూపాయలకే ఒప్పుకోవటం చాలా అదృష్టం, అనుకుంటూ ఎక్కి కూచున్నాను - "అక్కడికే-ఇంకేం పైకి పోనక్కర్లేదు -" అంటూ.

ఊరంతా దాటి, మళ్ళీ ట్రంకురోడ్డెక్కి, ట్రంకురోడ్డుమీద మైలుదూరమూ వెళ్ళి, ఎడమవేపు మలుపుతిరిగి - రిక్షా లేబర్ కాలనీ రోడ్డుమీద వెళ్తుండగా — అప్పుడనిపించింది — ఈ ప్రయాణంలో ఏదో మార్పుందని.

చప్పున తెలిసింది. కుదుపులు లేవు. రిక్షా గుంతల్లో పడటం లేదు. రిక్షాచైను కటకటమని కష్టపడటం లేదు. ఆశ్చర్యం ! దారి పొడవునా ట్యూబ్‌లైట్లు వెలుగుతున్నాయి ! ఆ పాల వెలుతురులో మెరుస్తోంది - నున్నటి నల్లటి తారురోడ్డు !!

"అరె-తార్రోడ్డు ! -" అనేశాను పైకే.

"అవున్సార్-కొత్తగా వేశారు-" అన్నాడు రిక్షావాడు.

'ఓహో' అనుకున్నాను. బస్టాండునుంచి వైకుంఠనగర్‌కి రిక్షావాడు కేవలం రెండు రూపాయలే అడగటం ఎందుకో ఇప్పుడర్థమైంది.

"అదేనయ్యా చూస్తున్నాను.... పోయిన్సంవత్సరంవొచ్చాగా అప్పుడు లేదు తార్రోడ్డు —"

"లేదు సార్-ఈమధ్యన్నే – అంతా- నెలయ్యుంటుంది ఈ రోడ్డువేసి-లేబర్ కాలనీ దాకా వేశారు సార్ -" అన్నాడు. బండిని వైకుంఠనగర్ వేపు మలుపు తిప్పుతూ.

మళ్ళీ-వైకుంఠనగర్ రోడ్డుకి తారులేదు. అయినా మునుపటంత అధ్వాన్నంగా లేదు. మట్టీ కంకరాపోసి చదును చేసినట్టు - కొంచెం మంచి స్థితిలోనే ఉంది.

రెండ్రూపాయలు పుచ్చుకుని చక్కా వెళ్లాడు రిక్షావాడు. మా పూర్ణాయ్ లక్షణంగా ఇంట్లోనే దొరికాడు.

మనిషిని చూడగానే కావలించుకోవటమూ, కుశలప్రశ్నల్తో చంపకుండా కులాసాగా జోకు లెయ్యటమూ, వొచ్చిన పనేవిటని అడక్కుండా అతిథ్యపు ఏర్పాట్లు చెయ్యటమూ - ఇవి పూర్ణాయ్ వ్యక్తిత్వంలో ప్రత్యేక లక్షణాలు !

భోజనాలు ముగిశాక, డాబామీద ఏర్పాటయిన పడకలు చేరుకున్నాం.

ఊరికి దూరమనే మాట నిజమేగాని, పూర్ణాయ్ ఉంటున్న ప్రాంతం చాలా ప్రశాంతంగా ఉంటుంది. దూరాన కొండను అందుకోటానికి వంగిన ఆకాశం, దేవతల సౌందర్య భిక్షలాగా నక్షత్రాలు, లేటుగా ఉదయిస్తున్న బహుళ పంచమి చంద్రుడి లేత ఎరుపు వెలుగులూ ....అంతా ఎంతో రమ్యంగా ఉంది.

ట్రంకురోడ్డుమీద అప్పుడప్పుడూ వెళ్ళే వాహనాల హెడ్ లైట్లు కనిపిస్తున్నాయి.

(లేబర్ కాలనీ తారురోడ్డు – తెల్లటి ట్యూబ్‌లైట్ల కాంతి పడినచోటల్లా - నల్లగామెరుస్తోంది.)

"చాలా బాగుందోయ్ -" అన్నాను నేను, సౌందర్యారాధన నుంచి కాస్త తేరుకుని.

"మరే"- అన్నట్టు చూసి, నవ్వుతూ సిగరెట్టు వెలిగించాడు పూర్ణాయ్. "ఏం బావుందోయ్ !-" అన్నాడు అంతలోనే. మాట వరసకి అన్నమాటకైనా మాటపెంచటం మావాడి దురలవాట్లలో నాకు నచ్చిన గుణం !

"ఈ పరిసరాలూ.... ఈ వాతావరణమూ-చాలా బాగున్నాయి. కొత్తగా వేసిన ఆ తార్రోడ్డుందే — చాలా నీటుగా ఉంది. వీధిదీపాలు కూడా వెలుగుతూండటం - చాలా బాగుంది. అందం మాటేకాదోయ్ - నా ఉద్దేశం - చాలా సౌకర్యంగాకూడా ఉందని-"

"రోడ్డు కొత్తగా వేసిందని - నీ కెలా తెలుసు ?—"

"సంవత్సరమైందనుకో నేను ఇటు వచ్చి .... అప్పుడు లేదిది ... వేసి నెలయిందని — ఇందాకా నేనొచ్చిన రిక్షావాడు చెప్పాళ్ళే...."

"ఈ రోడ్డుకో కథుంది -" అన్నాడు పూర్ణాయ్. అన్నవాడు ఊరుకోక నా చెవులవేపు సాభిప్రాయంగా మార్చిమార్చి చూశాడు.

నేను వాడి డొక్కలో చూపుడు వేలితో పొడిచాను. "జోకులు మానవోయ్ - కథలంటే నేను చెవికోసుకునే మాట నిజమేగాని - తెలిసిన కథ చెప్పకుంటే నువ్వు నాలిక్కోసుకునే మాట అంతకన్న నిజం .... కానివ్వు మరి -" అన్నాను.

"చెప్తా - చెప్తా -" అంటూ, మూడ్ కోసమన్నట్టు సిగిరెట్టు నుంచి ఒక 'దీర్ఘ దమ్ము' లాగి, మొదలెట్టాడు పూర్ణాయ్ ....

* * *

కథా, కమామీషూ అంటారు చూశావా ? నువ్వు చూస్తున్న ఆ రోడ్డు - ఒక కమామీషు మాత్రమే ! అసలు కథ వేరే ఉంది. ఆ కథేమిటో తెలుసా ? ఎలెక్షన్లు ! మొన్నటికి మొన్న జరిగాయే- మునిసిపల్ ఎలెక్షన్లు .... అవ్వీ ....

లెక్కకి ఈ వార్డు ఇరవై రెండో వార్డు. ఊరు చివరగా ఉన్నప్పటికీ - చాలా ముఖ్యమైన వార్డు. రాజకీయంగా చూస్తే ఈ వార్డు చాలా కష్టమైన వార్డు ! ఎలాగంటావా ? చూడు - ఆ ట్రంకు రోడ్డు మీదనుంచి ఇటు తిన్నగా ఎడం వేపంతా ఇరవై రెండోవార్డే ! ఎంతవరకూ ? ఈ వైకుంఠనగర్‌తో ఆగలేదు— ఈ దిగువనున్న నందీ కాలనీ, ఆ ప్రక్కనున్న గుడిసెల సేవాసంఘం, ఆ పైన మిట్ట మీద కొత్త ఇళ్ళు, ఇందాకా ఊళ్ళోంచి ట్రంకురోడ్డు మీదికి నువ్వు మలుపు తిరిగావే - ఆ మలుపునుంచి సరాసరి లేబర్ కాలనీకి ఐమూలగా ఉన్న ఇళ్ళన్నీ, అన్నిటికన్నా ముఖ్యం – ఈ లేబర్ కాలనీ .... కలసి వెరశి ఇరవై రెండో వార్డు ! చాలా పెద్ద వార్డే నన్నమాట ....

దేశమంతా ఒక న్యూసు పాకింది - నువ్వు విన్నావో లేదోగాని, ఈసారి మునిసిపాలిటీ ఎలెక్షన్లు కొత్త ఫక్కీలో జరుగుతాయని.

అమెరికా ప్రెశిడెంటు ఎన్నికలాగా - మునిసిపల్ ఛెయిర్మెన్ని పురప్రజలంతా డైరెక్టుగా ఎన్నుకుంటారని....

ఈ పద్ధతి చాలా మంచిదన్నారు కొందరు. ఏం బావుండటు- అన్నారు మరి కొందరు. అసలీ డైరెక్టు ఛెయిర్మను ఎన్నిక ప్రపోజలుందే - ఇదో పెద్ద కుట్రకి చిన్న శాంపిలన్నారు. మునిసిపాలిటీతో మొదలు పెట్టి, జిల్లా పరిషత్తు ఛెయిర్మను, తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆఖరుగా దేశప్రధాని ఎన్నికకూడా - అంతా డైరెక్టు పద్ధతే అయిపోతుందని....దానివల్ల మన ప్రజాస్వామ్యానికి చాలా నష్టాలున్నాయనీ ....

సరేలే — అదంతా ఒక పెద్ద డిబేటు.

మన రోడ్డు కథకి - డైరెక్టు ఎలక్షను గురించిన న్యూసుతో డైరెక్టుగా అయితే సంబంధం లేదు. కాని, ఈసారి ఎన్నికలలో ఏయే శక్తులు పనిచేశాయో తెలియటం ముఖ్యం కదా - అందుకని చెప్పాను ....

న్యూసు న్యూసుగానే వెనక్కి వెళ్ళిపోయింది. ఈ సారికి మామూలు పాతపద్ధతి ఇండైరెక్టు ఎన్నికే ఉంటుందన్నారు.

అసరికే ప్రచారం మొదలు పెట్టేసిన - అధికారంలో ఉన్న ఛెయిర్మనూ; అతగాణ్ణి పడగొట్టాలని మూడు ఎన్నికలనుంచీ విఫల కృషి చేస్తూ వొచ్చిన బలమైన ఒక ప్రత్యర్థీ కూడా—

ప్రచారం పద్ధతి మార్చుకున్నారు.

ఏ వార్డులో ఎవర్ని తమ కాండిడేట్లుగా పెట్టాలా అని లజుగుజలు మొదలు పెట్టారు.

(కథ వినాలనుకుంటావుగాని, నా ధోరణి నీ కొంచెం విసుగని తెలుసు. సంగతి మొదలెడితే సాధ్యమైనన్ని వివరాల్చెప్పటం నా వీక్నెసు — నీకు తెలుసుగా —)

ఈ సారి ఎన్నికల్లో ఒక ప్రత్యేకమైన లక్షణం కనబడింది. అదేంటో తెలుసా ! డబ్బు ....

నువ్వేం నవ్వక్కర్లేదు. నాదేం పెద్ద డిస్కవరీ కాదు గాని - సందర్భం - విను —

ఇండియాలో ఎలెక్షనంటే - కులమూ, డబ్బూ - అని నాదో చిరకాలపు థీసిస్సుంది.

అసలు బ్రిటిషు వాళ్ళు ఈ పవిత్ర దేశాన్ని కైవసం చేసుకోవటానికి ఉపయోగించిన ముఖ్యమైన ఎత్తుగడల్లో - మన కుల వ్యవస్థను వాళ్ళ ప్రయోజనాలకి వాడుకోవట మొకటి.

ఇప్పటికీ - మన రాజకీయ పార్టీల అగ్రనాయకులు - ఎమ్మెల్లే — ఎంపీ సీట్లకి టికెట్లిచ్చేప్పుడూ — ముందుగా ఏం చూస్తారనుకున్నావు ? ఆ కాండిడేటు కులం ! మరియూ - ఆ కులానికి ఆ నియోజకవర్గంలో ఏమాత్రం పలుకుబడి ఉందీ అని —

ముందు కులం, తర్వాత డబ్బూ - మునిసిపల్ ఎన్నికల మేరకైనా - ఈ సూత్రం ముమ్మాటికీ నిజం - అనేవారు రాజకీయ నిపుణులు.

చెప్పొచ్చిం దేవిటంటే — ఈసారి ఎన్నికల్లో డబ్బు — కులాన్ని త్రోసి కొన్నిలరంది !—(త్రోసి రాజంది - పాత ఇడియం— ఏమంటావ్ ?)

అలాగని కులంచూసి ఎవ్వరూ ఓట్లే వెయ్యలేదనీ కాదు....

నీ చిరచిర నాకర్థం — కాదుటోయ్ ? — వొస్తున్నా ....

మా ఇరవై రెండో వార్డు కౌన్సిలర్ పదవికి — మొత్తం పంథొమ్మిదిమంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ పూర్తిసంఖ్య — ఎన్నికలు దగ్గరపడిన నాలుగు రోజులదాకా ఎవరికీ అస్సలే తెలియదనుకో ....

పంథొమ్మిది మందిలో పదిహేను మందిదాకా — లోకల్ కాండిడేట్లు. అనగా - ఇరవై రెండో వార్డులోనే నివసిస్తున్నవారు. మిగత నలుగురూ నాన్‌లోకల్.... ఊళ్ళో ఇంకెక్కడో ఉంటున్న వాళ్ళు.

ఏ వార్డు వాళ్ళు ఏ వార్డులోనైనా నిలబడవచ్చు — మనది స్వేచ్ఛాయుత సమగ్ర ప్రజాస్వామ్యం కదా !....

ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలన్నిటిలోనూ మనదేశం విలక్షణమైనది ! ఒక్క రాజకీయ రంగంలోనే కాదు — అన్ని రంగాల్లోనూ....

అందునా — ఈ యుగధర్మం ఉందే - బహువిచిత్రమైనదీ-

అంతర్జాతీయ ంగా ఇదే యుగం ? — "అంతర్‌గ్రహ" యుగం. అవునా ?

ఇండియాకు మాత్రం ఇది "కొడుకుల యుగం" నవ్వకు. చాలా సీరియస్‌గానే చెప్తున్నాను.

రాజకీయ నాయకుల్ని తీసుకో, వ్యాపారవేత్తల్ని తీసుకో, సినిమా స్టార్లని తీసుకో, కవులూ కళాకారుల్నీ తీసుకో —

తమ అధికారం, తమ డబ్బు, తమ గ్లామర్, తమకీర్తి -

అన్నిటికీ తమ సుపుత్రుల్ని వారసులుగా నిలబెట్టాలని - అబ్బో - ఎంత తాపత్రయ మంటావు !

వెళ్ళిపోయే తరం, స్వంత మనుషుల్ని - వొచ్చే తరానికి ప్రతినిధులుగా పెడుతున్నారు - యుగధర్మం - 'మనఖర్మం' అంటాడొక మిత్రుడు - ఏదైతేనేం ?

ఈ యుగధర్మం ప్రభావం - ఆంధ్రా అంతా జరిగిన ఎన్నికలమీద ఎలా ఉందో తెలియదుగాని — మా మునిసిపాలిటీ ఎన్నికలమీద బాగా పడింది. కళ్ళజూసినంతవరకూ మా వార్డు ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది.

నందీ కాలనీలో ఓ పెద్ద కంట్రాక్టరున్నాడు. ఆయన కొడుకు సైకిలు గుర్తుతో నిలబడ్డాడు. మా వైకుంఠనగర్ నుంచి మరో కంట్రాక్టర్ కొడుకు - కుర్చీ గుర్తుతో నిలబడ్డాడు. అటు ఎగువనున్న హోటెలు ప్రొప్రయిటర్ అల్లుడు (ఆయనకు కొడుకుల్లేరు!) టంబ్లర్ గుర్తుతో పోటీ చేశాడు. మరో లక్షాధికారి చిన్నకొడుకు కారు గుర్తుతో తలపడ్డాడు.

లిస్టింకా చాలా పెద్దదే ఉందిగాని, మొత్తానికి ధోరణి ఏమిటో తెలిసిందనుకుంటా, 'నిలబడ్డారు' అంటే — సదరు కుర్ర కాండేట్లని - వాళ్ళ పెద్దలు వెనకుండి - నిలబెట్టారు.

ఎన్నికల్లో నెగ్గితేగిగ్గితే - స్థానిక రాజకీయాల్లోనే అగుగాక బాగా నిలబడి ఇంకా పైకి ఎగబ్రాక వచ్చునుకున్నారు కుర్ర అభ్యర్థులు, మొన్న మొన్నటి దాకా కాలేజీ ఎగ్గొట్టి మందు పార్టీలు చేసుకుంటూనో, కోకలవెంటా సోకులవెంటా తిరుగుతూ యావన శక్తిని సార్థకపరచుకుంటూనో — ఉండిన 'వెల్టుడూ' శ్రీమంతుల వారసులే వీళ్ళంతా. ఒక్కసారిగా ఎన్నికలలో 'నిలబెట్టబడేసరి'- చేతులు జోడించి నమస్కారాలు చెయ్యటాలూ, వినయంగా గంభీరంగా నవ్వటాలూ.... ప్రజాస్వామ్యంవల్ల పకాజులాయీలు కూడా ఎంత మర్యాదస్థులుగా మారిపోతారో ....

కుర్చీ పొజిషన్ గట్టిదన్నారు. కారు ప్రచారం జోరుగా ఉందన్నారు. ఈసారి ఛాన్సు గ్లాసే కొట్టేస్తుందన్నారు. ఎలెక్షన్ రేసును సైకిలే గెలుస్తుందన్నారు. లోకల్ అభ్యర్థుల గురించి ఇలా ఊహాగానాలు బయలుదేరీ బయలుదేరకనే - విచిత్రమైన వేగంతో ప్రచారం మొదలెట్టారు ఇద్దరు నాన్‌లోకల్ అభ్యర్థులు. ఒకరిది కంచం గుర్తు ! ఒకరిది మంచం గుర్తు! (నాన్‌లోకల్ వాళ్ళే మరో ఇద్దరు నిలబడ్డారు గాని — వాళ్ళ గుర్తులైనా గుర్తులేవునాకు. ప్రచారంకూడా వాళ్ళు బొత్తిగా చెయ్యలేదు. నామ్‌కేవాస్తే — డిక్లరేషన్లు ఆ రెండూ !)

కంచం అభ్యర్థి - ఊళ్ళో ప్రముఖ వ్యాపారవేత్త కొడుకు, రాజకీయాలకు కొత్తవాడేగాని, బిజినెస్ వ్యవహారాల్లో తండ్రికి కుడిచెయ్యిగా మెలగటం చేత — పుష్కలమైన వ్యవహార జ్ఞానం గడించినవాడు. అతని పూర్తిపేరు అది వీరవరాహ .... ఏదో చాలా పొడుగు. సౌకర్యానికి — కంచాలావు — అందాం.

మంచం కాండిడేటు తండ్రి ఎక్సు మునిసిపల్ కౌన్సిలరు. ఆ రకంగా - అంతో ఇంతో రాజకీయ పరిజ్ఞానం ఉన్నవాడు. స్థితిమంతుడు కలిసిరాకపోవటం వల్ల తండ్రి రంగనిష్క్రమణ చేసినా — తను ఎన్నటికైనా తండ్రిపేరు నిలబెట్టి పైకి రావాలనుకుంటున్న ఆశయం ఉన్నవాడు. ఇతనిది.. గుర్తుండి చావనిపేరు. సరే — మంచాలావు — అందాం.

కంచం — మంచం .... రెండూ పోటీపడుతూ దిగాయి .... ఇరవై రెండో వార్డు ఎన్నికల రంగంలోకి.

గోడలమీద రాతలతో మొదలయింది. బానర్లూ, తోరణాలూ, ఏజెంట్ల నియామకాలూ, కరపత్రాలూ, మోడల్ బాలట్ పేపర్లూ, ఓటర్ల జాబితా సేకరణలూ....ముమ్మరంగా సాగింది ప్రచారం. ఖర్చుకు వెనుకాడలేదు ఇద్దరూ. ఇంటింటికీ ప్రచారం ఉధృత స్థాయినందుకుంది.

నాన్‌లోకల్ అభ్యర్థులు వచ్చిపడి వార్డునంతా ఇలామంత్రించి నెయ్యటం లోకల్ అభ్యర్థులకు ములుగర్రతో పొడిచినట్టయింది.

కంట్రాక్టర్ల కొడుకులిద్దరూ — సైకిలూ, కుర్చీ — అదనపు బలాన్నూ సమకూర్చుకున్నారు. హోటల్ యజమాని అల్లుడుగ్లాసు అభ్యర్థి — ఎన్నిక ముగిసేదాకా - కార్యకర్తలకూ— అభిమానులకూ, ఫ్రీబోర్డింగ్-ఉచిత కాఫీ, టీ, టిఫిన్, భోజన వసతి-ప్రకటించేశాడు.

లక్షాధికారి ముద్దుల కొడుకు, తన గుర్తు సార్థక మనిపించేలా- ముప్పై నల్లబై కార్లు ఎలాగో ఆపేటికి వచ్చేలా చేసి - పొడుగుపాటి ఊరేగింపు జరిపి — అదరగొట్టేశాడు.

ఈ పటాటోపమూ ప్రచారాలధాటీ చూసి - గుండెచెక్కలై ఒక అభ్యర్థి - నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నాడు. మరో అభ్యర్థి -

ఆ పని చెయ్యకున్నా -"ఎందుకూ ఖర్చు దండగ" అనుకున్నట్టు - చేపట్టబోయిన ప్రచారం మానేసి హాయిగా ఇంట్లో కూచునేశాడు.

ఎన్నిక వారం రోజులుందనగా – వార్డు వార్డంతా – స్పీకర్ల గోలతో, రిక్షాలతో, గ్రూప్ చర్చలతో, కార్యకర్తల హడావుడితో - హోరెత్తిపోయింది.

కాండిడేట్లు రోజుకో ట్రిప్పు ఇంటింటికీ తిరగటంతో — వార్డు పౌరులకి ఊపిరి తిరక్కుండా పోయింది.

రాజకీయంగా ఈ వార్డు కష్టమైనదన్నాను కదూ ? .... దిగి చూస్తేగాని లోతు తెలీదు .... ఈ వార్డు కిందకొచ్చే ఓటర్లు నానా రకాల వాళ్ళు .... ఎవరి సింపతీ ఎటువేపుంటుందో తెలియదు .... ఈ వైకుంఠనగర్‌లో అంతా మధ్య తరగతి ఉద్యోగస్థులు — అటు నందీ కాలనీ అంతా కాస్త పై తరగతి సంపన్నులు .... అటుపైని గుడిసెల సేవాసంఘం వాళ్ళు — అట్టడుగు ప్రజ ! ట్రంకురోడ్డు పైనుంచి అటువొచ్చే రెండు వీధులూ అగ్రకుల పక్ష పాతులు .... ఇక ఈ లేబర్ కాలనీ .... చాలా పెద్ద కాలనీ. అటుపైన ఫ్యాక్టరీ ఉందిగాని అది మునిసిపల్ లిమిట్సులోకింకా చేరలేదు. లేబర్ కాలనీ — సంఖ్యా దృష్టితో చాలా ముఖ్యమైన ఆయువుపట్టు. వాళ్ళకో యూనియన్ ఉంది. యూనియన్ కార్య కలాపాలతో అంటీ ముట్టనట్టు—మరో అసమ్మతి వర్గం ఉంది —

ఏతావాతా— ఏ ఒక్క అభ్యర్థీ ఈ వార్డు ఓటర్ల మెజారిటీ అభిమానాన్ని చూరగొనడం అంటే — మాటలు కాదు !

లోకల్ అభ్యర్థులు ఎంతగా గింజుకున్నా — నాన్ లోకల్ అభ్యర్థుల ప్రచారాన్ని మరిపించలేక పోయారు. ప్రచారం అంతా పైపై పటాటోపమే – లోనుంచి 'బిల్డప్' చేసుకురావటం ఉత్తమం అనుకుని – తగుమనుషుల్ని వ్యవహారంలోకి లాగబోయారుగాని – అట్టి లాలూచీ పనులకూ్కడా ఆలస్యం బాగా అయిందని గ్రహించక తప్పలేదు.

అభ్యర్థుల తరఫున ఇంటింటికీ మహిళా కార్యకర్తలు తిరగటం అయింది. పసుపూ కుంకాలూ తాంబూలాలూ పంచి పెట్టడం అయింది. ఎన్నిక మూడో రోజుందనగా గుడిసెల సేవా సంఘం వారి పేటలో ఆడంగులందరికీ రవికె గుడ్డలు అందించాడు సైకిలు అభ్యర్థి. రవికెలేమిటి చీరలే ఇప్పిస్తానని—అంతపనీ చేశాడు గ్లాసు కాండిడేటు.

డబ్బు ఖర్చు, ప్రయాసా అనే కాదుగాని — ఇదంతా మామూలు ప్రచారమే కదా — ఇందులో ప్రత్యేకత ఏముందీ — అనే అభిప్రాయం కలిగింది కాబోలు మంచాలావుకి —

మరుసటి రోజునుంచి మనిషి కనిపించకుండా పోయాడు.

అతని అనుచరులూ కార్యకర్తలూ అంతా 'లాంగ్ డ్రాన్ ఫేసెస్'–నిలువునా వ్రేళ్ళాడేసిన ముఖాలతో–ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచిపెట్టారు.

మీ అభ్యర్థి ఏడీ – అని అడిగిన వాళ్ళకీ – అడగని వాళ్ళకీ కూడా —

"ఎలెక్షనుకని తిరిగి తిరిగి ఆరోగ్యమూ దెబ్బతింది– ఏదో దిగులూ పట్టుకుంది. ఇక బ్రతకనేమో అంటున్నాడు. రాయ వెల్లూర్‌లో స్పెషల్ వార్డులో ఉన్నాడిప్పుడు — డాక్టర్లకేమీ అంతుబట్టకుండా ఉంది –" అన్నారు.

ఇదంతా హంబగ్. ఓటర్ల సింపతీ సంపాయించటానికి అనారోగ్యంతో దిగులుతో మంచమెక్కినట్టు ట్రిక్ ప్లే చేస్తున్నాడు మంచాలావు – అని కంచం వాళ్ళు పసిగట్టేశారు.

ట్రిక్కో లక్కో తెలియదు. మంచాలావుకు మాత్రం ఆ రోజునుంచే అధిక సింపతీ లభించటం మొదలయింది. "అయ్యో పాపం" అన్నారు. "ఓడిపోతాడని దిగులా ?" అని ఆడంగులు బుగ్గలు నొక్కుకున్నారు. తొంభై శాతం ఓట్లు– ఇదుగో – ఇట్లాంటి సింపతీతో ఈజీగా పడిపోవూ ?

ఎలెక్షనుకి రెండేరోజులుంది.

కంచాలావు కార్యకర్తలకి ముచ్చెమట్లు పోసేశాయి. వాళ్ళు పొజిషనంతా విడమర్చి చెప్పేసరికి కంచాలావుకి దిక్కుతోచలేదు,

'సార్థక చిహ్నధరుడు' మంచాలావు ఎక్కడో రాయ వెల్లూరులో మంచమెక్కినట్టు – ట్రిక్ ప్లే చేస్తున్నాడు.

తనదీ సార్థక చిహ్నం కావాలంటే – కంచం ముందేసుకుని నడివీధిలో కుచోవాలా తను ? లేక – ఇంటింటికీ ఓ కంచం పంచి పెట్టాలా ? ఒక ఇంటికి ఒక కంచం ఇస్తే సరిపోతుందా? సరిపోవే! ఇస్తే – ఏం కంచాలివ్వాలి ? స్టీలువా ? పింగాణీవా ? పేపర్ ప్లేట్స్ ఇస్తే సరిపోతుందా ?

ఛాన్సు పోయింది. ఆ ప్రపంచం ఎక్కడపు పనేమిటో–ముందు తనే చేసుంటే పోయేది. ఇప్పుడాపని చేసినా – హాస్యాస్పదమై పోతుంది ;

ఎవరన్నారు తననిప్పుడు బ్రోచేవారు?– అని అంగలార్చాడు కంచాలావు.

"నేనున్నాను గదా—" అంటూ సమాలోచనలో జోక్యం చేసుకున్నాడు అతని తండ్రి.

"సమాచారమంతా నేనూ సేకరిస్తున్నాను. మంచాలావు మంచం ఎక్కితే ఎక్కాడుగాని - నువ్వేమీ ఎక్కలేవు....ఎలా చేసయినా సీటెక్కాలి నువ్వు – కౌన్సిలర్ సీటు – అంతే!...."

"అదెలా బాబాయ్ ?—" అని దూరాడు ప్రక్కనే ఉన్న అత్యుత్సుకర కార్యకర్త– "మంచమెక్కిన ట్రిక్కుతో మంచాలావు బోల్డు సింపతీ గెయిన్ చేసేశాడు —"

"అబ్బాయిలూ – " అన్నాడు కంచాలావు తండ్రి – "సింపతీ సంపాదించాడతను. సరే? బాగానే ఉంది. సింపతీ చూపటంవల్ల ఓటర్ల కేమొస్తుందీ ?

"ఏమీరాదు – సానుభూతితో ఓట్లు – అతనికి వేసేస్తారు."

"అలా వెయ్యొద్దని చెప్తాం —"

"అదెలాగ ?"

"మీ సింపతీవల్ల అతనికి లాభం – కాని మీకేం లాభం ? ఏమీ లాభం లేదని చెప్తాం —"

"వింటారా ?"

"వాళ్ళందరికీ లాభం కలిగే మార్గం చెప్తే – తప్పక వింటారు...."

"లాభం అంటే-ఓటుకింత అని- డబ్బులు పంచటమేనా-?"

నవ్వాడు కాండిడేటు పిత — "పావుగంట క్రితం నాకు అందిన సమాచారం బట్టి – ఈ రాత్రే ప్రారంభమవుతోంది – ఓట్ల కొనుగోలు కార్యక్రమం. లోకల్ అభ్యర్థులు సైకిలూ – కారూ....ఆ వ్యాపారం చెయ్యబోతున్నారు...."

"మరి – మనమేం చేద్దాం డాడీ?–" అన్నాడు కంచాలావు, గొంతు తడారిపోతూండగా.

భయపడకన్నట్టు సుపుత్రుడి వీపుతట్టి, అతని అనుచరులతో అన్నాడు తండ్రి – "ఎలెక్షనంటే బిగ్ బిజినెస్. కాస్త సైకాలజీ– కాస్త జూదమూ ఉందిగాని – మిగతంతా ప్యూర్ వ్యాపారం .... ఖాళీ చేసిన ఇళ్ళ కాపురస్తుల ఓట్లూ, ప్రస్తుతం ఊళ్ళోలేనివాళ్ళ ఓట్లూ....వాటి మాటేం చేస్తారు ?...."

చాణక్యుడి ముని ముని మనవడిలాంటి ఒక కార్యకర్త గుంభనంగా నవ్వాడు — "రెండువందల ఓట్లదాకా ఉంటాయవి.. వాటి గురించి బెంగ ఏమీ పడనవసరంలేదు...."

"బాబాయ్ – అట్లాంటి సంగతులు మాకొదిలెయ్యండి – మధ్యాహ్నం దాకా చూస్తాం. ఊళ్ళో ఉండీ బూత్ దగ్గరకు రాని ఓటర్లుంటారు. ఆ ఓట్లన్నీ ఖచ్చితంగా కంచావికే ముద్ర పడిపోతాయ్ –" అన్నారు మరో యువ కార్యకర్త.

"వెరీ గుడ్ – ఎలెక్షన్‌రోజు ఉదయం ఆరునుంచి వ్యాన్లూ కార్లూ సరిపడేన్ని – రెడీలో ఉంచుతున్నారు కద – మరింక ఎవరి డ్యూటీమీద వాళ్ల వెళ్ళండి –" అని నలుగురైదుగురు ముఖ్య కార్యకర్తల్ని తప్ప మిగత అందర్నీ పంపించేశాడు కంచాలావు తండ్రి.

"డాడీ — మరి — మంచాలావు సింపతీని పడగొట్టి.... ఓటర్లకేదో లాభం...." అనబోయాడు.

"శ్!" అని అతణ్ణి వారించి; ముఖ్యకార్యకర్తల్ని వారగా పిలిచి వాళ్ళకేవో ఆదేశాలిచ్చి వాళ్ళని పంపేశాడు తండ్రి.

"ఏమిటి డాడీ – నాకేం అర్థం కావటం లేదు -" అన్నాడు సుపుత్రుడు.

"పిచ్చినాయనా....హడావుడిలోపడి —ఇరవై రెండో వార్డుకి ఆయువుపట్టయిన లేబర్ కాలనీని తగినంత ప్రత్యేకంగా పట్టించుకోవటం మరిచి పోయావు నువ్వు. మనమిప్పుడు అక్కడికే వెళ్తున్నాం .. "

"కారు రెడీ చేయించనా ...."

"వొద్దు – మనం కాలినడకనే వెళ్తున్నాం —"

కంచాలావు అతని తండ్రీ కాలినడకన ఆ రాత్రి లేబర్ కాలనీకి వెళ్ళిన విషయం చాలా మందికి తెలుసు. వెళ్ళి అక్కడ వాళ్ళు ఏం చేశారో, ఎవర్తో ఏం మాట్లాడారో – బయటికి రాలేదు.

మరునటి రోజుకి కంచమా మంచమా అంటే – ఎవరూ చెప్పేస్థితిలో లేరు.

చెప్తా - చెప్తా నోయ్ .... మరీ తొందర పడిపోకు.

ప్రచారం పర్వం ముగిసింది.

పోలింగు పర్వం మొదలైంది.

ఆ రోజు - ప్రతి వార్డు లాగా – మావార్డూ తిరణాలే అయిపోయింది.

బ్యాడ్జీలు ధరించి వాలెంటీర్లు తిరిగారు, కార్లూ - వ్యాన్లూ తిరిగాయి, బూత్‌లముందు పోలీసు నిలుచుండి, కాండిడేట్లు వంగి వంగి దండాలు పెట్టారు —అంతా షరా మామూలే.

లోకల్ కాండిడేట్లు – ప్రతివాడూ – గెలుపు నాదంటే నాదేనన్నాడు.

ఓట్ల లెక్కింపు రోజు - అప్పుడిక గొప్పలు చెప్పటాలు లేవుగాని - అంతా దైవాధీనం అనేవారే.

లెక్కింపు ముగిసింది.

మావాడ్డుకి — కంచాౢలావు గెలిచాడు। రెండున్నర వేల థంపింగ్ మెజారిటీతో ....

సైకిలన్నారే —కారన్నారే — మంచం తప్పదన్నారే — కంచం ఎలా వచ్చిందనుకున్న వాళ్ళకి —

మెల్లగా తెలిసింది సమాచారం ....

వొచ్చేశాగా — ఇంకా తొందరెందుకూ —

కష్టపడి నేను సేకరించిన వివరాలబట్టి — పూర్తి భోగట్టా ఇదీ ...

కంచాౢలావూ అతని తండ్రీ లేబర్ కాలనీకి వెళ్ళారు గదా- ఆరాత్రి —

అంత పెద్ద బిజినెస్‌మాను తమ దగ్గరికి స్వయానా కాలి నడకన రావడంతో కొంతమంది లేబర్ జనం చాలా పొంగి పోయారు —

"ఈ మాత్రం దానికి మీరు రావాలా సార్ .... అబ్బాయి గారి గెలుపే — మా గెలుపు కదా ...." అన్నారు.

"మీరు అంతపని చెయ్యలేరని కాదు ... ఏదో నా ఆత్రుత కొద్దీ వొచ్చాను–భరోసా ఇచ్చినంత మాత్రాన చాలదు – నిర్మొహమాటంగా చెప్తున్నాను – ఏమనుకోకండి — ఎందుకంటే — ఇవి ఎన్నికలు ..." అని ఆయన అంటూ ఉండగానే .....

ఇదివరకు ఇంటినుంచి బయలుదేరేముందు ఆయన పంపిన కార్యకర్తలు వచ్చారక్కడికి-వాళ్ళతోబాటు - లేబర్ యూనియన్ నాయకుడూ, కొంత దూరంగా — అసమ్మతి వర్గ నాయకుడూ — మరికొంత ఎడంగా కాలనీలో ప్రముఖులనదగిన కొందరు తల నెరవబోతున్న వాళ్లూ – ఉన్నారు.

అందరికీ తండ్రీ కొడుకులిద్దరూ ప్రత్యేకంగా నమస్కారాలు చేశారు.

"మనంకాస్త ప్రయివేటుగా మాట్లాడుకుంటే బాగుంటుంది– ఎందుకంటే —. ఎన్నికలు ...." అన్నాడు తండ్రి.

"మాఇంటికి వెళ్దాం రండి –" అన్నాడు యూనియన్ నాయకుడు, తన అనుచరుల్తో గుసగుసలాడాడు.

కంచాౢలావు అనుచరులు అసమ్మతివర్గ నాయకుడితోనూ, తలనెరవబోతున్న పెద్దలతోనూ సంప్రదించారు.

యూనియన్ నాయకుడి ఇంట్లో సమావేశం కావటానికి ఎవరూ అభ్యంతర పెట్టలేదు.

సమావేశాన్ని అతి నేర్పుగా నిర్వహించాడు కంచాౢలావు తండ్రి – "తెలిసో తెలీకో....మావాడీ ఎలెక్షన్‌లో దిగేశాడు. వాడి ఉత్సాహం చూసి కాదన్లేక పోయానుగాని ఇప్పుడిది నాకు ప్రెస్టిజ్ ఇష్యూ అయి కూచుంది. అయినా మీరంతా ఉన్నారని నాధైర్యం"–

"మరేం ఫర్వాలేదు. మా సపోర్టుంది — ప్రామిస్‌సార్– మనబ్బాయి గెలిచి తీరతాడు" వగైరా భరోసాలు వినిపించాయి.

"చాలాసంతోషం. కాని నా భయాలు నావి. జయాపజయాలు దైవాధీనంఅంటారు. ఆ దైవాధీనం నాకొద్దు. ఆమనూరైనా–మావాడు గెలవాలి – నేను తిన్నగా మీ దగ్గరికే ఎందుకొచ్చానో గ్రహించే ఉంటారు....ఈ కాలనీవి మూకుమ్మడి ఓట్లు. కాలనీ అంతా ఎవరికి ఓటుచేస్తే — వాడే గెలుస్తాడు — మిగత కాలనీలవీ గుడిసెలవీ కొంచెం అటూ ఇటూ అయినా! డబ్బు పంచే వాళ్ళమాటా ఓట్లుకొనే వాళ్ళమాట వొద్దు. మావాడు గెలవాలి-మీరు గెలిపించాలి. చెప్పండి- ఏం చెయ్యమంటారు? మీలో మీకు అభిప్రాయభేదాలున్నా - నా మీద అభిమానంతో - ఇక్కడ సమావేశమయ్యారు - ఇదే సంతోషంగా ఉంది - ఇక మావాణ్ణి గెలిపించటానికి - ఏం చెయ్యమన్నా – సంతోషంగా చేస్తాను -" అన్నాడు కంచౢలావు తండ్రి.

సీరియస్ ముఖంతో లేచాడు అసమ్మతి వర్గీయుడొకడు - "సరేలెండి సార్- ఎలెక్షను కాబట్టి - ఎవరైనా ఇలాగే చెప్తారు."

"యస్-" అన్నాడు కంచాౢలావు పిత. "అవును! స్వార్థమేనయ్యా – ఒప్పుకుంటాను!– మీకేం కావాలో చెప్పండీ అంటున్నాను – నా కొడుకు కౌన్సిలర్ కావటంవల్ల మీకేం ప్రయోజనం ఉండదా? ఏం కావాలో అడగండంటున్నాను-"

క్షణం ఆలోచించి యూనియన్ నాయకుడన్నాడు "సరేసార్ అంతెందుకు ? ట్రంకు రోడ్డు నుంచి మా లేబర్ కాలనీకి సరయిన రోడ్డు లేదు. రాత్రిళ్ల దీపాలుండవు. ఇంతవరకు ప్రతికౌన్సిలర్‌కూ చెప్పినా - పట్టించుకున్నవాడు లేడు -"

"నేను వేయిస్తాను. రోడ్డు వేయిస్తాను - లైట్లువేయిస్తాను- ఎన్నికయితే —" అన్నారు కంచాత్రలావు.

యూనియన్ నాయకుడు చిన్నగా నవ్వాడు— "ఎలెక్షన్ ప్రామిస్సుల్లో ఎవరికీనమ్మకం ఉండదుసార్. క్రితంసారి కౌన్సిలరూ ఇలాగే అన్నాడు - ఎన్నిక ముందు — తర్వాత - వార్డువేపే చూడ లేదు. ఈ కంకర గుంతల రోడ్డుమీద మేమూ మా లేడీసూ పిల్లలూ పడే అవస్థ అంతా ఇంతాకాదు - రాత్రిళ్లూ - వానకురిసిన రాత్రిళ్ళయితే - మరీ ఘోరంగా ఉంటుంది .... మా ఫ్యాక్టరీ యజమాన్లకి ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనంలేదు. ఫండ్సు లేవంటారు. కాలనీ మునిసిపల్ లిమిట్సులో ఉందిగనుక, ట్రంకు రోడ్డునుంచి రోడ్డువెయ్యాల్సిన బాధ్యత - మునిసిపాలిటీదేనంటారు. మాకు మాత్రం దురవస్థ తప్పటంలేదు. నోటిమాటల్తో ఏమవుతుంది ?-"

అసమ్మతి వర్గనాయకుడు అందుకున్నాడు- "ఎన్నికయిన వాళ్ళకీ — చెయ్యాలనే ఉంటుంది. కాని - పదవీ బాధ్యతల్లోపడి - వార్డు విషయాలే మరిచిపోతారు !-" అతని మాటల్లో వ్యంగ్యం ధ్వనించింది.

పరిస్థితినంతా క్షణంలో ఆకళింపు చేసుకున్నాడు కంచాత్రలావు తండ్రి. సమావేశమైన వాళ్ళందరివంకా, మార్చి మార్చి చూశాడు. "వెరీగుడ్" అన్నాడు నవ్వకుండా.

ఆయన కనుసన్న గ్రహించి, అనుచరుడు లెదర్ బ్యాగ్ అందించాడు. అందులోంచి కొన్ని నోట్లకట్టలు లెక్కపెట్టి తీసి, అందరికీ కనిపించేలా చాపమీద పరిచి ప్రదర్శించాడు కంచత్రలావు కన్నతండ్రి. "ఇదుగోండి - పాతికవేలు !-" అన్నాడు.

అంతడబ్బు ఒక్కసారిగా ఎందుకు ముందుకొచ్చిందో — 'కాలనీయు'లకు వెంటనే అర్థం కాలేదు.

విడమరిచి చెప్పాడు పిత -

"లంచం కాదు ! ఓట్లు కొనటం కాదు ! డిపాజిట్, మావాడు మీదగ్గిరుంచుతున్న డిపాజిట్ ! నాకు తెలుసు - మీరు నలుగురు పెద్దలూ ఏ కాండిడేట్ను కావాలనుకుంటే ఆ కాండిడేట్ను గెలిపి చగలరు. మీ మాట విలువ అలాంటిది ! ఏం ? మావాణ్ణి గెలిపించండి. ఎన్నికయిన వెంటనే - సాధ్యమైనంత తొందరలో- రోడ్డు వేయిస్తాడు మీ కాలనీకి - లైట్లు వేయిస్తాడు. రోడ్డూలైట్లూ మావాడు వేయిస్తేనే — ఈ డిపాజిట్ డబ్బు పాతికవేలు వెనక్కి ఇవ్వండి. లేదూ - డబ్బుని మీరేం చేసుకున్నా - మీ యిష్టం. మీరే రోడ్డు వేయించుకుంటారో, లైట్లే వేయించుకుంటారో - ఇంటింటికీ ఇంత అని పంచుకుంటారో - మీ యిష్టం. మీరు తలుచుకుంటే మావాడు గెలుస్తాడు. గెలవకపోయే ప్రశ్నేలేదు - ఒకవేళ ఖర్మకాలి గెలవలేదనుకోండి -"

"రైట్ - అంతపనే జరిగితే - మేమే డబ్బువాపసిచ్చేస్తాం- మీరడిగేదాకాకూడా ఉంచుకోం -" అన్నాడు యూనియన్ నాయకుడు.

బాగుందంటే బాగుందన్నారందరూ.

సమావేశం నుంచి బైటికొచ్చేస్తూ "బరువు తీరింది." అన్నాడు కాండిడేటు పితృపాదుడు.

"డాడీ - మరి - నేను గెలిచాక - రోడ్డు వేయించాక - వాళ్ళు డబ్బు తిరిగి ఇవ్వకపోతే ?-" అనే అపర్థసందేహం వెలి బుచ్చాడు కంచాత్రలావు.

"అలా ఒక్కనాటికీ జరగదు. గెలిచిన కాండిడేట్‌తో విరోధమనేది రాజకీయాల్లో అసంభవమైన విషయం! చూస్తూండు.."

అలా చూస్తూనే ఉండిపోయిన కొడుకు, అత్యధిక మెజారిటీతో ఎన్నిక గెలిచేశాడు. ఆ తర్వాత తండ్రి ఆదేశం మేరకు లేబర్ కాలనీకి ఒక నెలరోజుల్లోనే రోడ్డు వేయించేసి పాతికవేల డిపాజిట్టూ వెనక్కి తెచ్చుకున్నాడు. మంచి కౌన్సిలర్‌గా పేరు సంపాదించుకున్నాడు.

అదీ ఈ రోడు కథ —

* * *

అని మరో సిగిరెట్టు వెలిగించాడు పూర్ణాయ్.

"బాగుంది —" అన్నానేన్నేను.

"ఏది బాగుంది ?" అని రెట్టించాడు మా వాడు — "కంచాత్రలావు గెలవటమా ? కాలనీకి రోడ్డు వేయించటమా ?"

"రెండూను. లేబర్ కాలనీ వాళ్ళు మాటప్రకారం కంచాత్రలావును గెలిపించారూ — రోడ్డూ లైట్లూకూడా వేయించుకున్నారు ! కంచాత్రలావు ఎన్నికలో గొప్ప మెజారిటీతో గెలిచాడూ — రోడ్డు

వేయించి మాట నిలుపు కోవటమేగాక డిపాజిట్ సొమ్ము వెనక్కి రప్పించుకున్నాడు? కాని .... రోడ్డు వేయించింది మునిసిపాలిటీ డబ్బుతోనే కదా .... డిపాజిట్ తతంగం లేకుండా అది జరిగి ఉండదా ?—"

"జరిగి ఉండదు! స్వార్థం చూసుకోకుండా ఏ రాజకీయజీవీ ప్రజాసేవ చెయ్యడు! పాతికవేల డిపాజిట్ లేకుంటే – ఈరోడ్డు వేయించేమాటా – అన్ని ఎలెక్షన్ ప్రామిస్సుకలాగే – కంచాలరావు గెలిచిన మరుసటి క్షణమే గాలిలో కలిసిపోయుండేది .... గివ్ అండ్ టేక్ – అదే వ్యాపారం కిటుకు. ఆ కిటుకు ఉపయోగించే కంచాలరావు తండ్రి కొడుకును కౌన్సిలర్ సీటులో కూచోబెట్టాడు. ఈ లావాదేవీలో ఎవరూ నష్టపోలేదు. ఇక మునిసిపాలిటీ సంగతా ? చెయ్యాలనుకుంటే మార్గాలెప్పుడూ ఉంటాయి. మా మునిసిపాలిటీకి – బోలెడు ఫండ్సున్నాయి. ఆ ఫండ్సు ఎలా చితికి ఏజేబుల్లోకి జీర్ణమౌతుంటాయో మరి .... మందీ మార్బలానికీ లోటు లేదు – కాని వాళ్ళ పనిగంటలు వాళ్ళకి నిద్ర గంటలుగానో స్వంతపని గంటలుగానో ఉపయోగ పడుతుంటాయి. ఫండ్సులో కొత్త శాతమూ, సిబ్బంది డ్యూటీలో కొంతకాలమూ ప్రజలకు ఉపయోగపడేలా చూట్టమే కౌన్సిలర్ బాధ్యత. పాతికవేలకి వడ్డీ ఎక్కడ నష్టపోతానో అని – నెలతిరక్కుండానే రోడ్డేయించాడు. కంచాలరావు. లేకుంటే – అంత తొందరగా కూడా పూనుకోక పోవును –" అని ఆగాడు పూర్ణాయ్.

"బాగుంది" అన్నాను, ఈసారి – స్వగతంలా,

"ఈ సందర్భంగా నాదోఫేసిస్తుంది –" అన్నాడు మావాడు.

"ఏమిటది ?" అని నేను అడిగేలోపలే చెప్పాడు –

"ఇటీవల జాతీయస్థాయిలో ప్రతిపక్షాలంతా చేరి – ఎన్నికల సంస్కరణలు జరగాలని చర్చలు మొదలెట్టారు. పాలకపక్షం కూడా అప్పుడప్పుడూ ఈ ముక్క అంటూనే ఉంది. ఓటర్లందరికీ – ఐడెంటిటీ కార్డు లివ్వాలి .... అభ్యర్థి ప్రతివాడూ ఎన్నికల ఎకౌంట్లు తయారు చెయ్యాలి – ఎకౌంట్సుని బహిరంగంగా ప్రకటించాలి .... వగైరా, వగైరా. చర్చలదాకా రంజుగా ఉంటుందిగాని ప్రతిపక్షమూ పాలకవర్గమూ ఈ సంస్కరణలకి పూర్తిగా ముందుకు రావటంలేదు. ఎన్నికలు ఎలాజరిగితే వాళ్ళకేం? వాళ్ళకి – ఎన్నికల్లో నెగ్గటం కావాలి – సీటులో కూచోవటం కావాలి .... ఆ రకంగా ఎన్నికల సంస్కరణలు జరిగినా మానినా – ఓటర్లకేం ఒరుగుతుందీ ? ఎన్నికలు ముగిశాక పాతపాటే ! డబ్బున్నవాడు సీటెక్కుతాడు – ఓటిచ్చినవాడు దరిద్రంలోనే ఉంటాడు....అందుచేత–" అని నాటకీయంగా ఆగాడు పూర్ణాయ్....

"చెప్పు మరి –" అన్నాను.

"ఈ డిపాజిట్ పద్ధతి బెస్టు — ఇకనుంచి ఓటర్లంతా పంచాయితీ నుంచీ పార్లమెంటు ఎన్నికదాకా – ఈ పద్ధతే ఫాలో కావాలి. కాండిడేట్ని నిలదీసి డిపాజిట్ కట్టించుకుని అతణ్ణి గెలిపించటం .... గెలిచాక అతను చెప్పిన పని చెయ్యకుంటే — డిపాజిట్ డబ్బుతో పదిమందికీ పనికొచ్చే పనేదో ఓటర్లే చేయించుకోవటం .... అనగా ఎన్నికల సంస్కరణ అనేది ఈ రకంగా ప్రజలే చేస్తారన్నమాట .... ఇలా చేస్తే మన ప్రజాస్వామ్యం ప్రత్యేక పద్ధతిలో ప్రపంచానికే మార్గదర్శకమౌతుంది — ఏమంటావ్ ?—"

"ఆలోచించాల్సిందే !–" అన్నాను నేను.

అవునా ?